
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

3

శనివారం 31 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా)

31-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	38	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	29
చీరాల	37	28



సన్నబియ్యంతో భోజనం

- మధ్యాహ్న భోజనంలో మార్పులు
- సంక్షేమ హాస్టళ్లలోనూ పంపిణీకి ఏర్పాట్లు
- పాఠసరఫరాల శాఖకు ఇండెంట్ పంపిన విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదివేల ఎంటీల సేకరణ
- బియ్యం పక్కదారి పట్టకుండా నేరుగా కళాశాలలు, పాఠశాలలకే పంపిణీ



గుంటూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి): దొడ్డ బియ్యంతో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు ఇంతకాలం అల్లాడి పోయారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నా.. చాలామంది ఇళ్ల నుంచి క్యారేజిలు తెచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ పరిశీలనలో సన్నబియ్యంతో అయితే భోజనం చేస్తామని విద్యార్థులు చెప్పారు. దీంతో రానున్న విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఇక నుంచి (మిగతా 4వ పేజీలో)

జల్‌జీవన్..జాగు

- గ్రామీణులకు అందని స్వచ్ఛజలం
- అట్టడుగున పల్నాడు, బాపట్ల జిల్లాలు
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- గడువుదాటి ఏడాదైనా అరకొరగానే పనులు
- మూడు జిల్లాల్లో 54 గ్రామాల్లోనే నూరుశాతం కుళాయిలు

2024 మార్చి కల్లా ప్రతీఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. గ్రామాల్లోని తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి నూరుశాతం ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాలి.. అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో ఆరేళ్లుగా జాప్యం జరుగుతోంది. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరుగారి పోయింది. ఇప్పటికీ పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించలేదంటే పనులపై అధికారుల్లో ఏపాటి శ్రద్ధ కనిపిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





గండిగనుమల గ్రామంలో నీటి కోసం పాట్లు

కుళాయిలు ఇలా..

జిల్లా	మొత్తం గృహాలు	కుళాయిలున్నవి	లేనివి	శాతం
పల్నాడు	4,34,399	1,54,243	2,80,156	35.51
గుంటూరు	2,33,883	1,58,407	75,476	67.73
బాపట్ల	3,64,788	1,48,980	2,16,808	40.67
మొత్తం	10,33,070	4,61,630	5,72,440	44.68

44.68 శాతమే పూర్తి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,33,070 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 4,61,630 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే 44.68 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇంకా 5,72,440 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటికి గుంటూ రు, పల్నాడు, బాటప్ల జిల్లాలో 54 గ్రామాల్లో మాత్రమే నూరుశాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వగలిగారు. తాగునీటి పథకాలు, చెరువుల అభివృద్ధి, పైపులైన్ల పునరుద్ధరణ, కుళాయి కనెక్షన్లు పనులు ఆరేళ్లుగా అరకొరగానే సాగుతున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల్లో అశ్రద్ధ.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇంటింటికి రక్షిత నీటిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో జల్‌జీవన్ మిషన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఆరేళ్లు అవుతున్నా ఇప్పటికీ సగం ఇళ్లకు కూడా కుళాయిల కనెక్షన్లు ఇవ్వలేదు. ఉన్న తాగునీటి పథకాలను, చెరువులను అభివృద్ధి చేయలేదు. జలజీవన్ మిషన్ కింద తాగు నీటి పథకాల అభివృద్ధి నత్తనడకన సాగుతోంది. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే అట్టడుగున నిలిచాయి. ప్రతి గ్రామంలో నూరుశాతం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.1021.38 కోట్ల అంచనాతో పనులు చేపట్టినా గతంలో, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాల కారణంగా పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో పనులు (మిగతా 4వ పేజీలో)


నేడు వినుకొండలో మెగా జాబ్‌మేళా

- హాజరు కానున్న 26 సంస్థల ప్రతినిధులు
- సద్వినియోగం చేసుకోవాలి : చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం వినుకొండలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే జాబ్‌మేళాకు టెక్ మహీంద్ర, డైకిన్, అప్నటెక్ సొల్యూషన్స్, అమర్‌రాజా, ముత్తూట్ ఫైనాన్స్, హీరో మోటోకార్ప్, హెటిరో, అపెక్స్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్, ఎస్‌బీఐ కార్డు సహా 26 సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 40 ఏళ్ల లోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు నిరుద్యోగులు సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఉద్యోగమేళా నిర్వహిస్తామని జీవీ ఆంజనేయులు తెలిపారు.

ఇద్దరికి కరోనా



- తెనాలి, ఉండవల్లిలో కేసుల గుర్తింపు
- జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ, ఐసోలేషన్ వార్డు
- సమృద్ధిగా ప్రాణవాయువు నిల్వలు సిద్ధం



గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తెనాలి, ఉండవల్లిలో ఇద్దరికి కరోనా సోకినట్లు గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు వైద్యశాలల్లో కొవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీ సమీపంలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. రోగుల నుంచి నేసల్ స్వాబ్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ర్యాపిడ్ కిట్ పరీక్షలు, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నారు. కరోనా పాజిటివ్ కేసులు నమోదైతే, రోగుల చికిత్సల కోసం బీ క్లాస్ వార్డులో 15 పడకలతో ఐసోలేషన్ వార్డును కూడా ఏర్పాటు చేశారు. వార్డులో వెంటిలేటర్లతో పాటు ఆక్సిజన్ కాన్‌సంట్రేటర్లను సిద్ధం చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 30 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు జీజీహెచ్‌లో సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు చేరినా ప్రాణవాయువు అందించేందుకు సిద్ధమని జీజీహెచ్ (మిగతా 4వ పేజీలో)

నేడే పింఛన్లు

- ఒకరోజు ముందు పంపిణీకి ఏర్పాట్లు
- మూడు జిల్లాలకు రూ.321.89 కోట్లు విడుదల
- ఎంపికైన వితంతువులకు 12న స్పౌజ్ కోటాలో..

నరసరావుపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ ఈసారి ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందనుంది. జూన్ 1 ఆదివారం. దీంతో శనివారం మే 31న పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నెలలోనే రూ.వెయ్యి పెంచి రూ.4 వేల చొప్పున పింఛను ఇస్తుంది. పైగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ, ఆ రోజు సెలవు అయితే ముందు రోజే సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛను అందజేసింది. కిందటేడాది సెప్టెంబరు, డిసెంబరు నెలల్లో ఒకటో తేదీ ఆదివారం, జనవరి 1 సెలవు కావడంతో ముందురోజే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ క్రమంలో ఈ నెలలోనూ ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ చేయనున్నారు. గుంటూరు జిల్లాలో 2,51,280 మంది పింఛనుదారులకు సంబంధించి రూ.109.02 కోట్లు, పల్నాడు జిల్లాలో 2,70,234 మందికి రూ.117.87 కోట్లు, బాపట్ల జిల్లాలో 2,25,787 మందికి రూ.95 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నగదును ఇప్పటికే సచివాలయ సిబ్బంది డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామునే లబ్ధిదారులను స్వయంగా కలిసి ఇవ్వనున్నారు.

వితంతవులకు కొత్తగా..

పింఛన్ పొందుతూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో భర్త మరణిస్తే వారి భార్యకు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్పౌజ్ కోటాలో దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేసి వారికి పింఛను అందజేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కోటాలో గుంటూరు జిల్లాలో 2,565, పల్నాడు జిల్లాలో 3,094, బాపట్ల జిల్లాలో 2715 మందికి పింఛను అర్హత లభించింది. వీరికి ఈ నెల 12న పింఛను అందించనున్నారు. గత ఏడాది పింఛనును రూ.1000 పెంచి ప్రారంభించిన రోజు కావడంతో కొత్తగా పింఛను పొందిన వారికి కూడా ఆ రోజు నుంచి ఇవ్వాని ప్రభుత్వం నిర్ణయించింది.

టిడ్కో ఇళ్లను పాడుపెట్టిన జగన్

- ఐదేళ్లు ఇబ్బందులు పడిన లబ్ధిదారులు
- టిడ్కో ఇళ్ల పరిశీలనలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో 90 శాతం వరకు పూర్తయిన టిడ్కో ఇళ్లను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్లు పాడుపెట్టారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని చెరువు రోడ్డులోని టిడ్కో సముదాయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ నివాసం ఉంటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సీలింగ్ ఫ్యాన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ఇళ్లులేని పేదలు నివాసయోగానికి దూరమై ఐదేళ్లు ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ విపరీత మనస్తత్వానికి ఇదొక నిదర్శనమని తెలిపారు.



టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

- పట్టణంలోని రెండు మంచినీటి చెరువులను ఎమ్మెల్యే పరిశీలించారు. సాగర్ నుంచి చెరువులకు విడుదలైన నీటి గురించి అధికారులను ప్రశ్నించారు. అన్ని మోటార్లను ఆడించి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు, టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, మద్దుమాల రవి, జంగా సుజాత, జంగా వినాయకరావు, తుపాకుల అప్పారావు పాల్గొన్నారు.

కంది.. కష్టాలు

- అమ్ముకోలేక అల్లాడుతున్న రైతులు
- సాగుదారుల లోగిళ్లలో వేల టన్నుల నిల్వలు
- మార్క్‌ఫెడ్ నిబంధనలు సవరించాలని వినతులు



రైతు ఇంట్లో నిల్వ ఉన్న కందుల బస్తాలు

పిడుగురాళ్ల, వినుకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈఏడు కంది సాగులో అత్యధిక దిగుబడులు వచ్చాయి. అమ్ముకుని కష్టాలు తీర్చుకోవచ్చని ఆశించిన రైతులకు కష్టాలు మిగిలాయి. పూర్తి స్థాయిలో అమ్ముకోలేక.. వర్షాల సమయంలో నిల్వ చేసుకోలేక అష్టకష్టాలు పడుతున్నారు. మార్చి 20 నుంచి మే 22 వరకు మాత్రమే కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ అవకాశం ఇచ్చింది. అయితే సచివాలయ సిబ్బంది, మార్క్‌ఫెడ్ అధికారులు ఆలస్యంగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ-క్రాప్, ఈకేవైసీ పూర్తయిన రైతుల నుంచి మాత్రమే కందులు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ నిబంధన విధించింది. దీంతో పూర్తిస్థాయిలో రైతులు అమ్ముకోలేక పోయారు. ఆయా నిబంధనలను సవరించాలని రైతులు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోలేదు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కందికి బదులు వరి, మొక్క జొన్న, ఏ పంట సాగు చేయలేదని ఈ-క్రాప్‌లో నమోదు చేశారని దీంతో తాము నష్టపోయామని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మాచవరం మండలంలో కందులు కొనుగోలు చేస్తామని రైతులకు గన్నీ సంచులు ఇచ్చి 20 రోజులుగా తూకం వేయకుండా వదిలేశారు. వినుకొండ నియోజకవర్గంలో 1096 హెక్టార్లలో కంది సాగు చేయగా 2,887 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. గురజాల నియోజకవర్గంలో 1220 హెక్టార్లకు 24 వేల క్వింటాళ్లు కొనుగోళ్లు జరిగాయి.

కౌలు రైతుల బాధ వర్ణనాతీతం

పొలం కౌలుకు తీసుకుని కందిపంట సాగుచేసిన రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. భూ యజమాని కౌలుకార్డులు పొంది పండించిన కంది పంటను విక్రయించుకోగా కౌలుకు తీసుకున్న భూమిలో పండించిన కందులు మాత్రం కౌలు రైతు విక్రయించు కో లేని పరిస్థితి నెలకొంది. బహిరంగ మార్కెట్‌లో కందులు క్వింటా రూ.6 వేలు ఉండగా మార్క్‌ఫెడ్ రూ.7 వేలు పైచిలుకు ధర ఉంది. అయితే వారి నిబంధనలతో లబ్ధి పొందలేక ఇటు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోలేక అల్లాడుతున్నారు. నిబంధనలు సవరించి మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రం అనుమతి ఇస్తే రైతుల నుంచి పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని జీడీసీఎంఎస్ జిల్లా మేనేజర్ హరగోపాల్ తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబు

- అధికారిక ఉత్తర్వులు విడుదల



4

భూసారం తెలుసుకుంటే సాగుకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి

అమరావతి, మే 30 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాలు తెలుసుకుని సాగు చేపడితే ఎరువుల ఖర్చు తగ్గి, అధిక దిగుబడి పొందవచ్చని లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి రైతులకు సూచించారు. లాం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గంగాదేవి రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. రైతులకు ట్రైకోడర్మ ప్యాకెట్లను ఐసీఏఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు.

పరిశుభ్రత పాటించాలి

- అంగన్వాడీ కేంద్రాల తనిఖీలో పీడీ

ఈపూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులు దృష్ట్యా ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. ఈపూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కిశోర వికాసంతో చదువుతో పాటు నైపుణ్యం, ఆరోగ్యవంతమైన జీవితానికి పౌష్టిక ఆహారం, విద్య అందిస్తామన్నారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈపూరులో సిబ్బంది నుంచి నగదు వసూళ్లపై ఫిర్యాదులతో ఆర్జేడీ ఆదేశాలతో వ్యక్తిగతంగా విచారణ జరిపామన్నారు.

ఏఎన్‌యూలో యోగాంధ్ర భారీ ర్యాలీ



ర్యాలీలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

పెదకాకాని, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూలో శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. వర్సిటీలోని ప్రధాన ప్రాంతాలు, మెయి న్ గేటు వద్ద నినాదాలు చేశారు. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, యూజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ప్రొఫెసర్ పాల్ కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి, వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, రత్తయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబు

గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వడ్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల చైర్మన్‌లను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ ఎ.భార్గవ్‌తేజ వ్యవహరించారు. నూతన చైర్మన్ హరిబాబు జూన్ మొదటి వారంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

మణిపాల్‌లో బోన్ బ్రిడ్జ్ ఇంప్లాంటేషన్ విజయవంతం

తాడేపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో ఏపీలోనే తొలిసారిగా బోన్ బ్రిడ్జ్ ఇంప్లాంటేషన్ విజయవంతంగా జరిగిందని డాక్టర్ సందీప్, శ్రీధర్, షహిదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోటియా అనే చెవుల లోపంతో పుట్టిన చిన్నారికి వినికిడి కల్పించారని పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సను కన్సల్టెంట్ ఈఎన్‌టీ, హెడ్ అండ్ నెక్ సర్జరీ అండ్ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ వీవీకే సందీప్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ షహిదా సంయుక్తంగా విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. సదరు చిన్నారి జన్మతహ రెండు చెవులలోనూ తీవ్రమైన కనెక్టివ్ హియరింగ్ లాస్‌తో మణిపాల్‌కు వచ్చిందని పేర్కొన్నారు. ఇయర్ కెనాల్ సరిగ్గా లేకపోవడంతో సాంప్రదాయ హియరింగ్ ఎయిడ్స్ ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా బోన్ కండక్షన్ పరిష్కారాలపై అవగాహన పెరిగే అవకాశం ఉందని డాక్టర్ సందీప్ తెలిపారు.

ఉన్నది 48 గంటలే..!

- 3న ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం
- మిగిలింది శని, సోమవారం, ఆదివారం సెలవు
- కొన్ని శాఖల్లో విడుదల కాని మార్గదర్శకాలు

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై సడలించిన నిషేధం మరో మూడు రోజుల్లో అమలులోకి రానుంది. అందులో ఒక రోజు ఆదివారం సెలవుదినం తీసేస్తే మిగిలేది కేవలం 48 గంటలు మాత్రమే. అయినప్పటికీ ఇంకా కొన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదు. కొన్నింటిలో అయితే కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయలేదు. అలానే మూడు, నాలుగు శాఖలకు అయితే ఇప్పటి వరకు బదిలీల మార్గదర్శకాలే విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో జూన్ 3వ తేదీ నుంచి అమలులోకి రానున్న నిషేధానికి మరికొన్ని రోజుల పాటు సడలింపు ఇవ్వాలని ఆయా శాఖల్లోని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు.

ఈ సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఈ నెల 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు ప్రభుత్వం సడలించింది. సెలవు దినాలు పోను 15 పని దినాలను కేటాయించి బదిలీల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేసింది. ఆ మేరకు విద్య, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల్లో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియని పూర్తి చేశారు. రెవెన్యూ, సర్వేలో ఇంకా కొనసాగుతోంది. ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లు, పంచాయతీరాజ్‌లోనూ ఇదే పరిస్థితి. వాణిజ్య పన్నుల శాఖలో అయితే బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలే జారీ కాలేదు. కొన్ని శాఖల్లో అయితే కౌన్సెలింగ్‌లు నిర్వహించకుండా ప్రజాప్రతినిధుల లేఖల సిఫార్సుల మేరకు బదిలీలు చేసేందుకు ప్రక్రియని పూర్తి చేశారు.

బదిలీ ఉత్తర్వులు ముందుగానే ఇస్తే ఉద్యోగులు ఎవరైనా కోర్టులో పిటిషన్లు వేస్తారన్న భయంతో చాలా శాఖల్లో అధికారులు ఆర్డర్స్ బయటకు విడుదల చేయలేదు. పాత తేదీతో జూన్ 3న విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. కాగా బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉందని, దీనిని మరో వారం నుంచి పది రోజుల పాటు పొడిగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర సంఘాల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాలను కూడా సమర్పించారు. అయితే ఈ వారం అంతా సీఎంతో సహా మంత్రులు పర్యటనల్లో ఉండటం వల్ల అమరావతి రాజధానిలో అందుబాటులో లేరు. సోమవారం విధులకు హాజరయ్యే అవకాశం ఉండటంతో పొడిగింపుపై నిర్ణయం ఆ రోజున తీసుకొనే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు.

రౌడీషీటర్లకు తగిన గుణపాఠం

బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోటి యాదవ్

తెనాలి అర్బన్, పెదకాకాని మే 30 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో రౌడీషీటర్లకు పోలీసులు తగిన గుణపాఠం చెప్పారని, కుల సంఘాలు వారిని వెనకేసుకుని రావడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి యువజన విభాగం అధ్యక్షుడు పి.కోటి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని తగిన విధంగా దండించకపోతే మరింత పెచ్చరిల్లుతారన్నారు. తప్పు చేయాలంటే భయపడాలనే ఉద్దేశంతోనే పోలీసులు అలా ప్రవర్తించారే కానీ, మరొకటి కాద న్నారు. ప్రాణహాని ఉందని పోలీసులకు బీసీ అయిన కానిస్టేబుల్ చిరంజీవి ఫిర్యాదు చేస్తేనే పోలీసులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కానిస్టేబుల్ భార్య ఎస్సీ అయినప్పటికీ వారికి న్యాయం చేయకుండా రౌడీషీటర్ల పక్షాన కుల సంఘాలు మాట్లాడటం సరి కాదని హితవు పలికారు. నిజంగా దళితులకు అన్యాయం జరిగితే తమ సంఘం కూడా పోరాడుతుందని రౌడీషీటర్లకు హంత కులకు మద్దతుగా నిలిస్తే కుల సంఘాల ఐక్యతకు విలువ లేకుండా పోతుంద న్నారు. గంజాయి కేసులో రౌడీ షీటర్లు నవీన్ కుమార్, జాన్ విక్టర్, రాకేష్‌ను అరెస్టు చేశారనే అక్కసుతో కానిస్టేబుల్ చిరంజీవిపైన వారు దాడి చేశారని గుర్తుచేశారు. కానిస్టేబుల్ భార్య ఒక ఎస్సీ అని, తల్లిదండ్రులు లేని అనాథ అనే విషయాన్ని దళిత సంఘాలు గుర్తించాలని కోరారు. రౌడీ షీటర్లు గంజాయి మత్తులో చిరంజీవిని చంపి ఉంటే దళిత మహిళకు అన్యాయం జరిగి ఉండేదన్నారు.

సీఎల్‌ఈఎస్‌ఏ నూతన కార్యవర్గం ఏర్పాటు



సమావేశంలో సీఎల్‌ఈఎస్‌ఏ ప్రతినిధులు

మంగళగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): కన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్, సర్వేయర్స్, ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తొలి కార్యవర్గ సమావేశం మంగళగిరిలో జరిగింది. సంఘం ఆవిర్భావంపై చర్చ, సర్వసభ్య సమావేశం, టెక్నికల్ సెమినార్లు, లోకల్ చాప్టర్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ చైర్మన్‌గా వేల్పుల రాము, చైర్మన్‌గా ఎం.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా కె.కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్.సుందరరాజు, ప్రధాన కార్యదర్శిగా నెలకంటి ఎన్‌వీఎస్ఎస్ మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్.సతీశ్‌కుమార్, కోశాధికారిగా యూఎస్ సంపత్‌కుమార్, మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. రాజమండ్రి జోన్ అధ్యక్షుడిగా ఏకే జిలానీ, అమలాపురం జోన్ అధ్యక్షుడిగా ఎస్.ఫణికుమార్, భీమవరం జోన్ అధ్యక్షుడిగా కేవీఎం కృష్ణ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

చదువులో జ్ఞానశ్రీ..దాతల చేయూత కావాలి



అవ్వారి జ్ఞానశ్రీ

పెదకూరపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చిన్న నాటి నుంచి చదువులో ఎంతో ప్రతిభ కలిగి.. ప్రతి క్లాసులో అన్ని సబ్జెక్టుల్లో 95 శాతానికి పైగా మంచి మార్కులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. పెదకూరపాడుకు చెందిన అవ్వారి జ్ఞానశ్రీ. తల్లి కుమారి, అమ్మమ్మ, తాతయ్య పర్యవేక్షణలో చదువును కొనసాగిస్తోంది. బాలిక తల్లి కుమారి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే..తన తల్లిదండ్రులు కూలీ పనుల ద్వారా వచ్చే డబ్బులతో కుమార్తెను చదివించుకుంది. దీంతో జ్ఞానశ్రీ 10వ తరగతిలో పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 587 మార్కులు సాధించింది. 2023లో జిల్లా స్థాయిలో ముందంజలో నిలిచింది. గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీలో 981 మార్కులు సాధించింది. జేఈఈ అడ్వాన్స్ పూర్తి చేసి.. జూన్ 2న విడుదలయ్యే ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. ప్రాథమిక విద్య స్థానికుల ఆర్థిక సాయంతో.. ఇంటర్మీడియెట్ దాతల విరాళాలతో పూర్తి చేసి చదువులో రాణిస్తోంది జ్ఞానశ్రీ. దాతలు చేయూతనిస్తే తన చదువుకు ఎటువంటి ఆటంకం కలగదని విద్యార్థిని కోరుకుంటోంది. ఆస్థులు లేకపోయినా.. చదువులో రాణిస్తున్న ఇలాంటి బాలికకు చే యూతనిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సహాయం చేయ దలచుకున్న దాతలు 72880 62392 నంబరు సంప్రదించాలని కోరారు.

3న ఏపీఆర్‌జేసీలో.. అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు



మాచర్ల రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో ఉన్న ఏపీఆర్‌జేసీలో అతిథి అధ్యాపక పోస్టులకు జూన్ 3వ తేదీన కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సరోజిని శుక్రవారం తెలిపారు. కళాశాలలో తెలుగు, సంస్కృతం, కెమిస్ట్రీ, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్‌తోపాటు మ్యాథమెటిక్స్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులు, ఇంగ్లీష్ మీడియంలో పాఠ్యాంశాల బోధన అర్హతలని తెలిపారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10:30 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

రెండు సినిమా హాళ్లకు లైసెన్స్‌లు లేవు

చిలకలూరిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో సినిమా థియేటర్ల తనిఖీలో రెండు థియేటర్లకు లైసెన్స్‌లు లేవని అధికారులు గుర్తించారు. యజమానులు వీలైనంత త్వరగా లైసెన్సు తెచ్చుకోవాలని తహసీల్దారు హుస్సేన్ సూచించారు. లైసెన్సు లేని కారణంగా ప్రస్తుతానికి ఈ థియేటర్లను మూసివేయించారు. పట్టణంలో మొత్తం పది సినిమా థియేటర్లు ఉండగా వాటిలో ఐదు మూతపడి ఉన్నాయి. ఆయా థియేటర్లలో వసతులు, సదుపాయాలను పరిశీలించిన అధికారులు వారికి పలు సూచనలు చేశారు. కొన్నింటిలో కనీసం 15 టికెట్లు అమ్ముడు పోతేనే షో ప్రారంభిస్తామని ముందుగానే షరతు విధించి టికెట్లు అమ్ముతున్నారు.

బంగారం, వెండి ఆభరణాల అపహరణ



పగులగొట్టిన బీరువా



దుండగులు వదిలివెళ్లిన బైక్

మాచర్లటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు గృహంలోకి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలు అపహరించిన ఘటన మాచర్ల పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన చల్లా పిచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం తన సోదరుడు నివాసముంటున్న గుంటూరుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి బయట తలుపునకు తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పిచ్చయ్యకు సమాచారం అందించారు. పిచ్చయ్య ఇంట్లో పరిశీలించగా.. బీరువా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గుర్తించారు. అందులోని ఐదు గ్రాముల బంగారం, చెవి దిద్దులు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. చోరీపై పట్టణ ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదు. అలాగే పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఓ గృహంలో చోరీకి యత్నిస్తుండగా కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో.. వారు అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు తమ ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బైకు పిడుగురాళ్ల పట్టణంలో దొంగిలించినదిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 512.40 అడుగులు ఉంది. ఇది 135.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 6048 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

ఆసియా క్రీడల్లో రజితకు స్వర్ణం



కుంజా రజిత

మంగళగిరి సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి కుంజా రజిత ఆసియా క్రీడల్లో మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. దక్షిణ కొరియాలోని గూమి నగరంలో గురువారం జరిగిన 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు తరపున ప్రాతినిథ్యం వహించిన రజిత 400 మీటర్ల రిలే పరుగులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయి భారత మహిళా రన్నర్లు జిస్నా మాథ్యూ, రూప చౌదరి, శుభ వెంకటేష్‌తో కూడిన 400 మీటర్ల రిలే పరుగు జట్టులో రజిత కూడా పాల్గొంది. ఈ జట్టు 3.34 సెకన్ల వ్యవధిలో నిర్ణీత దూరాన్ని చేరుకుని ఫైనల్స్‌లో వియత్నాం, శ్రీలంక జట్లను అధిగమించింది. 2013 తర్వాత ఇదే ఈవెంట్‌లో తిరిగి స్వర్ణ పతకం సాధించడం విశేషం. రజితను ఎస్ఆర్ఎం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, ప్రోవైస్ చాన్సలర్ డాక్టర్ సతీశ్‌కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్స్ అనూప్‌సింగ్ సూర్యవంశీ, సుస్మితా సింగ్, శ్రీపతి తదితరులు అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

సన్నబియ్యంతో భోజనం

(5వ పేజీ తరువాయి)

దొడ్డ బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి జిల్లా నుంచి ఇందుకు అవసరమైన ఇండెంట్‌ను పాఠశాల విద్యాశాఖ పౌరసరఫరాల శాఖకు పంపింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జడ్పీ మండల పరిషత్ ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు 600కిపైగా ఉండగా 6.75 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు మరో 100 కిపైగా ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. పాఠశాల, కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి, వసతిగృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ధాన్యం సేకరించిన పౌరసరఫరాల శాఖ

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు, వసతిగృహాలకు అవసరాల నిమిత్తం రాష్ట్రస్థాయిలో ధాన్యం సేకరించి జిల్లాల వారీగా పంపిణీకి పౌరసరఫరాల శాఖకు ఏర్పాట్లు చేసింది. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో గోదాముల నుంచి డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్దేశించిన పాఠశాలలకు, హాస్టళ్లకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించింది. దాదాపు పదివేలకు పైగా మెట్రిక్ టన్నులు బియ్యం అవసరమని ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

ప్రతి ఒక్కరూ భోజనం చేసేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ భోజనం చేసేలా ఇప్పటికే మెనూలో మార్పులు తీసుకొచ్చారు. తాజాగా బియ్యం పంపిణీలో కూడా మార్పులు తీసుకు రానుండడంతో విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేసే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జల్‌జీవన్‌లో.. జాగు

(5వ పేజీ తరువాయి)

ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ పథకం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. నిధులున్నా పనులు ముందుకు సాగడంలేదు. దీంతో గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో అపరిశుభ్రమైన, ఫ్లోరైడ్ ఉన్న నీటిని అనేక ప్రాంతాల్లో ప్రజలు వినియోగించుకోవాల్సి వస్తోంది. తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం లేదు.

● జల్‌జీవన్ మిషన్‌లో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో ఉంది. రూ.508.16 కోట్లు అంచనాతో 1055 పనులు చేపట్టగా 219 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 16 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది.

● బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలో ఉంది. జిల్లాలో 19.82 శాతం నుంచి 40.84 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. రూ.205.22 కోట్ల అంచనాతో చేపట్టిన 723 పనుల్లో 223 మాత్రమే పూర్తయ్యాయి. 10 గ్రామాల్లో మాత్రమే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు.

● గుంటూరు జిల్లాలో జల్‌జీవన్ అమల్లోకి వచ్చిన అనంతరం 33,731 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో ఉంది. 308 పనులు చేపట్టగా 172 పూర్తయ్యాయి. 28 గ్రామాల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఇద్దరికి కరోనా

(5వ పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి

రోగులు మాస్కులు ధరించాలి

దగ్గు, తుమ్ములతో బాధపడే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్యవర్గాలు కోరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొవిడ్-19 కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించి రావాలని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచనలు చేశారు. జ్వరం, చలి, నీరసం, గొంతు మంట, ఒంటినొప్పులు, నోరు చేదుగా ఉండటం, వాసన తెలియకపోవడం, తలనొప్పి ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది. కొవిడ్ కేసులు ప్రబలిన దేశాల నుంచి ప్రయాణం చేసి వచ్చే వారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపింది.

ఆందోళన అవసరం లేదు



కొవిడ్-19పై ప్రజలు ఆందోళన చెందవద్దు. ప్రస్తుతం సర్క్యులేట్‌లో ఉన్నది ఒమిక్రాన్ రూపంలో ఉన్న జేఎన్1 వేరియంట్. ఇది అంత ప్రమాదకారి కాదు. ఈ వేరియంట్ బారిన పడిన వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఆస్పత్రిలో చేరి చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నా, ఇతరులకు పెద్ద హాని కలిగించే శక్తి ఉండదు. అనుమానిత లక్షణాలతో వచ్చే రోగుల కోసం ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక కొవిడ్ ఓపీ, 15 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.

- డాక్టర్ రమణ యశస్వి, జీజీహెచ్ సూపరింటెండెంట్



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గి పంటలలో అధిక దిగుబడి పొందవచ్చని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని నరుకుళ్లపాడు గ్రామంలో లాం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గంగాదేవి రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఐసీఏఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు ట్రైకోడర్మా విరిడితో విత్తన శుద్ధి చేయడం వలన భూములలో ఉండే ఎండుతెగులు క్రిములు నాశనం అవుతాయన్నారు. రైతులకు ట్రైకోడర్మా ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం జూన్ 12వరకు వివిధ గ్రామాలలో నిర్వహించనున్నట్లు గంగాదేవి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దాచేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దాచేపల్లి ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. శుక్రవారం దాచేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. అధికారులు బదులిస్తూ విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మూలగుండ్ల కృష్ణకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కందుల జాను, డాక్టర్ అమూల్య, ఇతర శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని హక్కులు కల్పిస్తుంది

● తహసీల్దార్ మధుబాబు



సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుబాబు

పిడుగురాళ్ల, మే 30 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక హక్కులు ప్రభుత్వం కల్పిస్తుందని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. శుక్రవారం తుమ్మలచెరువు ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాలకు ఎవరైనా నిర్భయంగా వచ్చి తమ పనులు చేయించుకోవచ్చునని, ఎక్కడైనా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చునన్నారు. వీఆర్‌ఓలు కోటేశ్వరరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

దాచేపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం శనివారం సచివాలయం-1లో జరుగుతుందని కమిషనర్ అప్పారావు శుక్రవారం తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం జరుగుతుందని తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు పింఛన్‌ల పంపిణీ

మాచవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శనివారం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు బడిగుంతల వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు.

ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు గడువు పెంపు హర్షణీయం

పిడుగురాళ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు గడువు 8 సంవత్సరాల వరకే పరిమితమైంది. ఇప్పుడు 10 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడం సంతోషదాయకమని పిడుగురాళ్ల పట్టణ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నేతలు ముల్పూరి వెంకట్రామయ్య, జి.శ్రీనివాసరెడ్డి, పీజేఎస్ ధన్, సతీష్‌రెడ్డి, రామకృష్ణ, నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చాగంటి వారిపాలెంలో కిశోర వికాసం

ముప్పాళ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అనంతలక్ష్మీ కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రత, రక్తహీనతపై అవగాహన కల్పించారు. మహిళల పట్ల లింగ వివక్ష, అసమానతలు, సైబర్ నేరాలు, బాలికలకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పొదుపు అలవర్చుకోవాలి

క్రోసూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు చిన్నతనం నుంచే పొదుపు అలవర్చుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వణుకూరి మాధవి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అనే అంశం పై వారితో శుక్రవారం ఆమె చర్చించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కోనూరులో కిశోర వికాసం

అచ్చంపేట, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనూరు గ్రామంలో శుక్రవారం కిశోర వికాస కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం మాట్లాడారు. బాలికలకు ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు గురించి వివరించారు. యోగా వల్ల ఉపయోగాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏ రాములమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 30(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 21.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఈఏ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువకృష్ణకు విడుదల అవుతుందన్నారు.



కరాలపాడులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ లింగమూర్తి

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరగాలి

● పీడీ సిద్ద లింగమూర్తి

పిడుగురాళ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు వర్షాకాలం వచ్చేలోపే లక్ష్యాన్ని పూర్తిచేసేలా సిబ్బంది పనులు చేపట్టాలని పీడీ సిద్ద లింగమూర్తి తెలిపారు. కరాలపాడు గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఎన్ని రోజులు పనులకు హాజరవుతున్నారు.. జాబ్ కార్డులు వున్న వారందరికీ పనులు కల్పిస్తున్నారా.. అడిగిన వారికి కొత్త జాబ్‌కార్డులు ఇస్తున్నారా.. అనే విషయాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులకు వెళ్లేవారు పనుల్లో నాణ్యత, కొలతల ప్రకారం పనులు పూర్తిచేసేలా సిబ్బంది లక్ష్యాన్ని నిర్ధేశించాలన్నారు. ఏపీడీ మల్లికార్జునరావు, మండల ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు ఫిట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వండి

మాచవరం, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కంపోస్టు ఫిట్స్ ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించి రైతులను ప్రోత్సహించాలని డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి స్థానిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో ఏర్పాటుచేసుకున్న కంపోస్టు ఫిట్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో కంపోస్టు ఫిట్స్ ఏర్పాటు చేయటం వల్ల పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. తయారైన ఎరువును పొలాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. మాచవరం మండలంలో 160 కంపోస్టు ఫిట్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే విధంగా గృహాల ముందు షోక్ కిట్లు ఏర్పాటు చేసుకోవాలని, దీనివల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, వీధుల్లో మురుగునీరు చేరకుండా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మాచవరం మండలంలో 109 షోక్ కిట్లు ఏర్పాటుచేశామన్నారు. గంగిరెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో ఏర్పాటుచేసిన కంపోస్టు పిట్స్‌ను, షోక్ ఫిట్స్‌లను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో వెంగళరావు, ఏపీడీ మల్లికార్జునరావు, ఏపీవో కోటిరెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపిన మహానాడు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, మే 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల్లో మహానాడు ఉత్తేజాన్ని నింపిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడు రాష్ట్ర రాజకీయాల్లో మైలు రాయిగా నిలిచిందన్నారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం, నాయకత్వ తేజస్సు, ప్రజాసమస్యలపై సుదీర్ఘ చర్చలు మహానాడును ప్రత్యేకంగా నిలిపాయన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మహానాడు వేదికగా తీసుకున్న తీర్మానాలు, విధాన నిర్ణయాలు గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, లోకేశ్ యువశక్తితో పార్టీ మరో విజయగాథను రాయటానికి సిద్ధమవుతుందన్నారు. కార్యకర్తల్లో నూతన ఉత్సాహం, ప్రజల్లో కన్పిస్తున్న ఆశాభావం టీడీపీ భవిష్యత్ విజయానికి నాంది అన్నారు. మహానాడు విజయవంతానికి కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

అజెండాపై చర్చిస్తుండగానే ముగిసిన సమావేశం

● చైర్మన్ తీరుపై కౌన్సిలర్ల అసంతృప్తి



సమావేశంలో కమిషనర్ ఆనంద్‌కుమార్‌తో మాట్లాడుతున్న వైసీపీ కౌన్సిలర్లు

సత్తెనపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ సమావేశంలో శుక్రవారం పలువురు కౌన్సిలర్లు అజెండాలోని అంశాలను చర్చిస్తుండగానే కౌన్సిల్ సమావేశం ముగిసిందని చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసీ ప్రకటించటంతో కౌన్సిలర్లు అసంతృప్తికి గురయ్యారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు రంగిశెట్టి సుమన్, జెట్టి ఆనంద్, వైస్‌చైర్మన్ కోటేశ్వరరావునాయక్, కౌన్సిలర్ కటకం రామకృష్ణ తదితరులు అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. చర్చ జరుగుతున్న సమయంలో చైర్‌పర్సన్ లక్ష్మీ తులసీ సమావేశం ముగిసిందని ప్రకటించటంతో వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మళ్లీ మూడు నిమిషాలపాటు సమావేశం కొనసాగించిన చైర్‌పర్సన్ సమావేశం ముగిసిందని ప్రకటించటంతో కొంతమంది కౌన్సిలర్లు వెళ్ళిపోయారు. అజెండాలోని అంశాలన్నీ అందరు సమక్షంలో ఏమి ఆమోదించకపోయినా ఆమోదించినట్టు ప్రకటించటం తగదన్నారు. మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్‌కు ఫోన్‌చేస్తే స్పందించటం లేదని వైస్‌చైర్మన్ కోటేశ్వరరావునాయక్ ప్రశ్నించారు. దీనిపై వైస్ చైర్మన్‌లు కోటేశ్వరరావు నాయక్, నాగుల్ మీరాన్, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాదులు కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. కౌన్సిలర్ల ఫోన్‌లు తప్పనిసరి గా లిఫ్ట్ చేస్తామని కమిషనర్ తెలిపారు. ఇంకా పలు అంశాలపై చర్చ జరిగింది. అనారోగ్య కారణంగా త్వరగా వెళ్ళాల్సిఉందని, ఈ విషయాన్ని ముందుగానే కౌన్సిలర్లకు చెప్పానని చైర్‌పర్సన్ లక్ష్మీ తులసీ తెలిపారు. సచివాలయాల్లో కొంతమంది సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. అవినీతికి పాల్పడితే స చివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అజెండాలోని 25వ అంశానికి డీసెంట్ నోటీసు ఇస్తున్నట్టు జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కమిషనర్‌కు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

గురజాలలో భారీ వర్షం



పట్టణంలోని రజకవీధిలో వర్షపునీరు



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వర్షపునీరు

గురజాలటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు చేరింది. మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల ఎదురు, ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ, మాచర్ల ప్రధాన రహదారిపైకి వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



జన్మదిన వేడుకల్లో యెనుముల కేశవరెడ్డి

ఘనంగా యెనుముల జన్మదిన వేడుకలు

మాచర్లటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): సీనియర్ టీడీపీ నాయకుడు యెనుముల కేశవరెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో గల తన కార్యాలయంలో భారీ కేక్‌ను కట్‌చేసి నేతలు, అభిమానులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. దుర్గి మండలం ఆత్మకూరు వద్ద కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పట్టణంలో అన్ని వార్డుల్లో పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్‌లో పాల్గొని పంచిపెట్టారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

1 నుంచి డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

● తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్లటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి రేషన్ డీలర్ల వద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. రేషన్ షాపులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. అర్హులందరికీ రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ షాపుల తనిఖీ



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్

కారంపూడి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రేషన్ షాపులను శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు, తూకం కాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి ప్రజలకు రేషన్ బియ్యం, సరుకులను రేషన్ దుకాణాల వద్ద సరఫరా చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులు అందేలా చూస్తామన్నారు.

పాఠశాల ప్రారంభానికి ముందే విద్యా సామాగ్రి రాక



విద్యాకానుక కిట్ల వద్ద విద్యాశాఖ సిబ్బంది

రెంటచింతల, మే 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రారంభానికి ముందే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లు రెంటచింతలకు చేరాయి. మండలంలో 37 ప్రభుత్వ పాఠశాలలుండగా 3320 మంది బాలబాలికలున్నట్లు ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు చెప్పారు. నోట్‌బుక్స్, బెల్టులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, టెక్స్ట్ బుక్స్ స్టాక్ పాయింట్‌కు చేరాయి.

అనిల్ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం

పెదకూరపాడు, మే 30(ఆంధ్రజ్యోతి): మృతి చెందిన అనిల్ కుటుంబానికి రూ 10వేల ఆర్థిక సాయాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అందించారు. మండలంలోని ముస్సాపురం గ్రామంలో టీడీపీ యువ నాయకుడు కాకిరాల అనిల్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని రమేష్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల నాయకుడు మద్దినేని వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సహజసిద్ధ వృక్షాల భద్రత మనందరిది

● పర్యావరణ వేత్త అంకారావు



మొక్కలకు పాదులు తీస్తున్న జాజి

కారంపూడి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా మొలిచే మొక్కలు ప్రాథమిక దశలో గుర్తించి పాదులు తీసి సంరక్షణ, వృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) అన్నారు. శుక్రవారం కారంపూడిలోని వీర్ల దేవాలయం ఆవరణలో సహజసిద్ధంగా చిన్న మొక్కలుగా మొలిచిన వేప, దిరిసెన వంటి మొక్కలకు పాదులు తీసి నీళ్ల పోశారు. ప్రకృతి ప్రాణుల ద్వారా ఏటా కొన్ని కోట్ల మొక్కలు మొలుస్తాయని జాజి అన్నారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

రెంటచింతల, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కె.సరోజిని దేవి చెప్పారు. లబ్దిదారులందరూ అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

డీఈఈ రత్తయ్య బదిలీ

రెంటచింతల, మే 30(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో డీఈఈగా పనిచేస్తున్న రత్తయ్యను డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏ అమరావతికి బదిలీ చేస్తూ ఏపీజెన్కో ఎండీ చక్రధర్‌బాబు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదు

టీడీపీ నేతలు



విజయపురిసౌత్‌లో జగన్‌మీడియా ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

మాచర్లటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాపై పట్టణ టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయం వద్ద జగన్ మీడియా ప్రతులను దహనం చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపైనా, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పైన తప్పుడు కథనాలు రాస్తే చూస్తూ ఊరుకోమని, రాజకీయ కరపత్రికగా చెలామణి అవుతున్న అరాచక మీడియాపై కేసులు వేసి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే జూలకంటి పాటుపడుతుంటే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి తన నీచ రాజకీయాలతో పచ్చని పల్లెల్లో ఫ్యాక్షన్ రాజకీయాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, పోలూరి నరసింహారావు, కుమార్, వాసు, యర్రాకుల సిద్ధయ్య, గర్నే శ్రీనివాసరావు, వజ్రం నాయక్, గట్ల కోటిరెడ్డి, బండ్ల బ్రహ్మం, జాని, అనంతరాములు, యేచూరి సురేష్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి: నిజ నిర్ధారణ లేని తప్పుడు రాతలు రాస్తే తాట తీస్తామని కూటమి నేతలు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై జగన్ మీడియాలో వచ్చిన కథనాలను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కూటమి నేతలు మాట్లాడుతూ ఫ్యాక్షన్‌కు మారుపేరుగా ఉన్న పల్నాడును ప్రశాంతంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిపై జగన్ మీడియా తప్పుడు వార్తలు ప్రచురించడం విడ్డూరమన్నారు. అనంతరం జగన్ మీడియా కథనాలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతాశంకర్, లింగా రమేష్, మేకల దాసు, మాగులూరి నారయ్య, సింగు నాగేశ్వరరావు, దుర్గెంపూడి జానకిరామయ్య, గర్నిడీ రమేష్, కటకం రామారావు, పులి హరి, చెన్నయ్య, దొండపాటి చెన్నయ్య, లింగా బ్రహ్మయ్య, పసుమర్తి బుజ్జి, యాగంటి నరేష్, వలపాల వెంకటేశ్వర్లు, బొజ్జా నరసింహారావు, వంకమళ్ల కోటేశ్వరరావు, శ్రీరాం కాశిబాబు, చింతకాయల ఆదినారాయణ, వెంకట గురువులు, సూరె కృష్ణ, వెలిదండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కారంపూడి: జగన్ మీడియాను బ్యాన్ చేయాలంటూ కారంపూడిలో టీడీపీ నేతలు శుక్రవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఫ్యాక్షనిస్టుగాను, హంతకునిగా ప్రచారం చేస్తున్న జగన్ మీడియాను బ్యాన్ చేయాలని, అబద్ధపు వార్తలు చదివిన యాంకర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జగన్ మీడియా ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ దొడ్డా వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ రమావత్ నాగులనాయక్, నర్సింగ నాగేశ్వరరావు, గాడిపర్తి పూర్ణయ్య, నాగవరపు రాముడు, చప్పిడి రాము, మునుగోటి సత్యం, కోదాటి బాలయ్య, ఏసోబు, బొలినేడి హరి, పలిశెట్టి రాఘవ తదితరులు పాల్గొన్నారు.



కారంపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు

● రెంటచింతల: తప్పుడు వార్తలు రాసి కూటమి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని టీడీపీ నేతలు హెచ్చరించారు. శుక్రవారం ప్రధానరహదారిపై జగన్ మీడియా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ టీడీపీ నేత గొంటు ఆదిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి పిచ్చి రాతలు రాస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం రాజారెడ్డి, బీసీ నేత ప్రభురాజు యాదవ్, మంచికల్లు శివ, మాజీ ఎంపీపీ శౌంఠిరెడ్డి నాగమ్మ నర్సిరెడ్డి, యెనిగండ్ల అప్పయ్య, తాడపనేని కోటేశ్వరరావు, కొత్తా అంజి, చంద్రయ్య, మున్నా శ్రీనుయాదవ్, దావులూరి బాబు, లింగారెడ్డి, కృపారావు, మారాజు శ్రీనివాస్, నీలం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: తప్పుడు కథనాలను ప్రచురిస్తే సహించేది లేదని టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని విజయపురిసౌత్‌లో జగన్ మీడియా ప్రతులను టీడీపీ నేతలు దహనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, సత్తిబాబు, కట్టా రాజు, అప్పలరాజు, రాంచంద్, మస్తాన్, పవన్, బాలస్వామి, మంగమ్మ, రమణ, రాజారావు, యేసు పాల్గొన్నారు.

అన్నప్రసాద కమిటీకి గ్యాస్ పొయ్యి, వంట పాత్రల అందజేత

కారంపూడి, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత పది నెలలుగా దాతల సాయంతో ప్రతి శనివారం 300 మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్న శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటీకి శుక్రవారం గుండా వెంకటకృష్ణారావు, రమాదేవి దంపతులు గ్యాస్ పొయ్యి, వంట సామాన్లను అందించారు. కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకుడు భవిరిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

భూ మాయకు పరిష్కారమేదీ?

- ప్రభుత్వ భూముల విస్తీర్ణం పెంపు
- పలు పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు
- బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు
- మాచవరంలో అక్రమార్కుల దోపిడీ..
- పరిశీలనతో కాలం వెళ్లదీస్తున్న అధికారులు
- ఏళ్లు గడుస్తున్నా వెబ్ ల్యాండ్‌లో తొలగని పేర్లు



మాచవరం తహసీల్దారు కార్యాలయం

మాచవరం, మే 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా జనాభా, ఆస్తుల విలువ పెరగడం సమాజంలో చూస్తుంటాం. కానీ, ఎక్కడా లేని విధంగా మాచవరం మండలంలో భూమి విస్తీర్ణం పెరగడం పెరిగింది. బ్రిటీషర్లు తయారు చేసిన ఆర్ఎస్ఆర్ రికార్డులను మార్చి భూముల విస్తీర్ణం పెంచడంలో ఇక్కడ పని చేసిన రెవెన్యూ అధికారులకే చెల్లింది. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్ భూముల విస్తీర్ణం పెంచి... ఇష్టానుసారం వెబ్ ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయించుకొని.. బ్యాంకుల్లో రూ.లక్షల రుణాలు పొందారు. ఈ అక్రమాలు బయట పడినా.. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

మాచవరం రెవెన్యూ మాయ..

మాచవరం మండలంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇక్కడ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన అధికారులు ప్రభుత్వ భూములకు కూడా సర్వే సర్టిఫికెట్లు ఇచ్చి వెబ్ ల్యాండ్‌లో పేర్లు నమోదు చేశారు. సహజంగా పట్టా భూములు సర్వే చేసి సర్టిఫికెట్లు ఇస్తారు. కానీ, ఇక్కడ పనిచేసిన అధికారులు మాత్రం సర్వే నంబర్లతో సహా.. ప్రభుత్వ భూమి వివరాలను వారి అనుకూలమైన వ్యక్తులకు ఇస్తారు. సర్వే సర్టిఫికెట్‌తో పాటు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసే విధంగా బేర సారాలు కుదుర్చుకుంటారు.

వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం పెంపు..

మండలంలోని వేమవరం, తాడుట్ల, పిన్నెల్లి, పిల్లుట్ల తదితర గ్రామ రెవెన్యూ శివార్లలో ఆర్ఎస్ఆర్ రికార్డు కంటే అడంగల్, వెబ్ ల్యాండ్‌లలో భూమి విస్తీర్ణం అమాంతంగా పెంచేశారు. ఉదాహరణకు వేమవరం రెవెన్యూ శివార్లలో 116 సర్వే నంబరులో మొత్తం విస్తీర్ణం 14 సెంట్లు ఉండగా.. అది కాస్త 9.52 సెంట్లు విస్తీర్ణంగా నమోదైంది. అసలు భూ యజమాని గుమ్మా నారాయణమ్మ కాగా.. వెబ్ ల్యాండ్‌లో వేమవరం గ్రామానికి సంబంధం లేని వారి పేర్లు కూడా నమోదై ఉన్నాయి. అదే విధంగా సర్వే నంబరు 126/1లో 56 సెంట్లు ఉండగా భూమి ఉండగా.. అది కాస్త 9.11 సెంట్లు వెబ్ ల్యాండ్‌లో నమోదైంది. ఇక్కడ కూడా ఈ గ్రామానికి సంబంధం లేని వారి పేర్లు నమోదు కావటం విశేషం. 385/2లో 2.68 సెంట్లు ఉండగా వెబ్ ల్యాండ్‌లో 20.53 సెంట్లుగా విస్తీర్ణం పెంచారు. 404/39లో 64.73 సెంట్లు ఉండగా దానిని 82.37 సెంట్లుగా నమోదు చేశారు. 404/43లో 104.42 సెంట్లు ఉండగా దానిని 116.48 సెంట్లుగా పెంచి వేశారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు అనేక సర్వే నంబర్లలో ఉన్న భూమి కంటే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన విస్తీర్ణం అధికంగా ఉంది. దీనిని చూపించి, అక్రమార్కులు బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు.

చర్యలు శూన్యం..

నమోదైన పేర్లు దొంగవి అని తెలిసినప్పటికీ అధికారులు రికార్డుల నుంచి తొలగించక పోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి, పరిశీలన అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో జాబితాలను ప్రదర్శించి చేతులైతే దులుపుకున్నారు కానీ.. అక్రమ పేర్లను వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించడంలో ఎందుకు అశ్రద్ధ వహిస్తున్నారో.. వారికే తెలియాలి. అంతేగాకుండా మాచవరం మండలంలో ముంపునకు గురైన పులిచింతల ప్రాజెక్టు కింద పొలాలనూ కూడా వెబ్‌ల్యాండ్‌లో చూపించి.. ఆయా గ్రామాల బ్యాంకుల్లో లక్షలాది రూపాయల రుణాలు తీసుకున్న దాఖలాలు కోకొల్లలు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భూ మాయ పై లోతుగా విచారణ జరిపి.. అక్రమంగా వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసిన పేర్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వేలో తొలగిపోతాయి



వెబ్ ల్యాండ్‌లో అక్రమ పేర్లు త్వరలో జరగనున్న భూ రీ సర్వేలో తొలగిపోతాయి. త్వరలో వేమవరం గ్రామంలో రీ సర్వే జరుగుతుంది. ఆర్ఎస్ఆర్ దాఖలా కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన దొంగ పేర్లను తక్షణమే తొలగిస్తాం.

- నాగ మల్లేశ్వరరావు, తహసీల్దార్, మాచవరం

అతివలకు డిజిటల్ లక్ష్మీ కటాక్షం



శిక్షణలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

సత్తెనపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది డ్వాక్రా మహిళలు, స్థానికులు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను పొందే మార్గం తెలియక, దరఖాస్తు ఎలా చేయాలో అవగాహన లేక ఇబ్బందులు పడుతన్నారు. దీనిని ఆసరగా చేసుకొని కొందరు మధ్యవర్తులు వారి నుంచి దరఖాస్తు, ఆన్‌లైన్ సేవలకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం 'డిజిటల్ లక్ష్మి' సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, డిగ్రీ పూర్తి చేసిన డ్వాక్రా మహిళలను గుర్తించి డిజిటల్ లక్ష్మిగా ఎంపిక చేస్తున్నారు. వారికి ఉపాధి కల్పించి ఆర్థిక చేయూత అందించడంతో పాటు.. ప్రజలకు సేవలందించేలా ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో 21, వినుకొండలో 15, గురజాలలో ఐదుగురు, దాచేపల్లిలో ఎనిమిది మంది, పిడుగురాళ్లలో 18, నరసరావుపేటలో ఏడుగురు, మాచర్లలో 13, చిలకలూరిపేటలో 13 మందిని నేటికి డిజిటల్ లక్ష్మీలుగా ఎంపిక చేసి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వారికి ఆయా పురపాలక సంఘ కార్యాలయాల్లో శిక్షణ కూడా ఇస్తోంది. మీ-సేవా కేంద్రం మాదిరిగా డిజిటల్ లక్ష్మిలు సేవలందించనున్నారు. తమ ఇంటి ముందే కొద్ది పాటి స్థలం ఉంటే దుకాణాన్ని పెట్టుకొనేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు రూ.2లక్షల వరకు బ్యాంక్ రుణం ఇవ్వనున్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



టెన్నిస్ ఆడుతున్న ఏసీబీ డైరెక్టర్ జయలక్ష్మి

గుంటూరు(తూర్పు), మే 30(ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఓపెన్ టెన్నిస్ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. క్రీడలకు దూరంగా ఉండటంతో చిన్నవయస్సులోనే ఊబకాయం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో అతిథి అటవీ చీఫ్ కన్జర్వేటర్ బీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పిస్తే ఏ పీ టెన్నిస్ హబ్‌గా ఆవిర్భవిస్తుందన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ అండర్ 16 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు సహకరించిన సీనియర్ టెన్నిస్ ఆటగాడు ఎస్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, సీనియర్ టెన్నిస్ కోచ్‌లు బి.సాయి, అలపాటి సురేష్, అహ్మద్ పాల్గొన్నారు.

యోగాసనం..ఆరోగ్యానికి శాసనం

- యోగాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- శారీరక ఆరోగ్యం, మనసుకు ఆనందం
- యోగాంధ్ర నిర్ణయంపై ప్రజల్లో హర్షం
- నెల రోజులు యోగాపై విస్తృత ప్రచారం
- జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగా.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించే ఆయుధం. దీని వల్లనే వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ చూపుతున్నారు. యోగాసనాలకు కోసం కొంత సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా శిక్షకులు, యోగా కేంద్రాల సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలను రూపుమాపే



అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రపంచ వ్యాప్తంగా నమ్ముతున్నారు. దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది. మొత్తమ్మీద మన జీవితంలో ఇప్పుడు యోగ బాగమైంది. యోగాను తన దైనందిన జీవితంలో నిత్య కృత్యంగా మార్చుకున్నందు వల్లే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వయసులో కూడా అలసట, అలుపు లేకుండా ఆరోగ్యవంతుడిగా ఉంటున్నారు. యోగా గొప్పతనాన్ని గుర్తించడం వల్లే.. యోగా పట్ల అందరూ ఆకర్షితులయ్యేలా చేయాలని ఆయన కంకణం కట్టుకున్నారు. అందుకే జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గొప్పగా నిర్వహించి, యావత్ దేశం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు నుంచే రాష్ట్రంలోని ప్రతి కుటుంబం యోగాను ఆచరించేందుకు ప్రయత్నించాలని మహానాడు వేదికగా ఆయన పిలుపునిచ్చారు.

నెల రోజులు రాష్ట్రంలో విస్తృత ప్రచారం

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో రాష్ట్రంలో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో రెండు కోట్ల మందిని భాగస్వాములు చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రత్యక్షంగా ఏడు లక్షలు మంది పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రతి గ్రామంలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. యోగా ప్రాధాన్యతను ప్రజలకు వివరించే బాధ్యత ఉన్నతాధికారులకు అప్పగించారు.

పెరిగిన ప్రాధాన్యం

ఒత్తిడితో కూడిన యాంత్రిక జీవితంలో యోగా ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో యోగాను అభ్యసిస్తున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంది. ఆ సంఖ్యను మరింతగా పెంచాలని చెబుతున్నారు. ముఖ్యంగా యువత, మహిళలు యోగా పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచిస్తున్నారు. వైద్య నిపుణులు కూడా యోగా చేయాలని చెబుతున్నారు.

ఆసనాలు, ఉపయోగాలు..

భుజంగాసనం

పాము పడగ చిత్తినట్లు ఆకారం కలిగిన ఈ ఆసనం వేయడంతో చాతి భాగం విప్పారుతుంది. ఊపిరితిత్తులు బలపడతాయి. వెన్ను దృఢంగా ఉంటుంది. నడుం నొప్పి తగ్గుతుంది. ఈ ఆసనంతో ఎముకలకు బలం చేకూరుతుంది.

ధనురాసనం

ధనుస్సును పోలిన ఈ ఆసనం ఎత్తు పెరిగేందుకు ఉపయోగపడుతుంది. కీళ్ల సంబంధ వ్యాధులు తగ్గుతాయి. మలబద్ధకం పోతుంది. షుగర్ నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా యువత ఈ ఆసనం నేర్చుకోవాలి.

పశ్చిమోత్తాన ఆసనం

ఈ ఆసనం ద్వారా పొట్ట సంబంధ వ్యాధులు తగ్గుతాయి. జననాంగాలకు వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. మహిళలు, వృద్ధులు అభ్యసించాలి.

ఓస్త్రాసనం

ఒంటె ఆకారాన్ని పోలిన ఈ ఆసనం వల్ల నడుం నొప్పి తగ్గి, వెన్ను సామర్థ్యం పెరుగుతుంది. సర్వే కాల్ స్పాండిలైటిస్ బాధ పడే వారికీ ఈ ఆసనం ఎంతో ఉపయోగం.

శవాసనం

దీనిని అమృతాసనం అని కూడా పిలుస్తారు. ఆసనాల ప్రారంభంలోనూ, మధ్యలోనూ, పూర్తయిన తర్వాత కూడా దీనిని వేసుకోవాలి. దీంతో శరీరానికి ప్రశాంతత లభిస్తుంది. అన్ని వయసుల వారూ ఆచరించవచ్చు.

శశాంకాసనం

చంద్రుని ముఖం వలె ప్రకాశించే రూపును కలిగించే ఈ ఆసనంతో తలనొప్పి ఒత్తిడి తగ్గుతుంది. ఊపిరితిత్తులకు ప్రాణ వాయువు అందజేస్తుంది. కోపం వంటివి మెల్లగా తగ్గుముఖం పడతాయి. బీపీ, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులతో బాధపడేవారు ఈ ఆసనాన్ని ఆచరించవచ్చు.

త్రిభుజాసనం

ఇది వెన్నుముకను, కాళ్లను సాగదీస్తుంది, నడుము, భుజాలను బలంగా మారుస్తుంది.

భుజంగ ఆసనం

ఇది వెన్నుముకను పైకి ఎత్తి, కడుపు, చాతి కండరాలను బలపరుస్తుంది.

అధోముఖ స్వ నా ఆసనం

ఇది మొత్తం శరీరానికి బలం వశ్యతను ఇస్తుంది, నడుమును చేతులను సాగదీస్తుంది.

తలాసనం

ఇది మెదడుకు, శరీరం మొత్తానికి బలం చేకూరుస్తుంది. ముఖ్యంగా మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

గరుడాసనం

శరీరానికి సమతుల్యతను చేకూరుస్తుంది. ముఖ్యంగా దీర్ఘకాల వ్యాధుల నివారణకు ఈ ఆసనం ఆచరించవచ్చు.



80 ఏళ్ల వయసులోనూ..

గుంటూరు బ్రాడీపేటలో స్థిర నివాసం ఏర్పరచుకొని.. యోగా శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ జైహింద్ ఎనిమిది పదుల వయసులోనూ క్లిష్టతరమైన ఎన్నో ఆసనాలు వేసి అందరిని అబ్బుర పరుస్తున్నారు. 2001లో జైహింద్ దంపతులు యోగా పట్ల ఆకర్షితులయ్యారు. దాని గొప్పతనాన్ని గుర్తించి అందరిని ఆరోగ్యవంతులుగా చేయాలనే సంకల్పంతో 2006లో గుంటూరులో శిక్షణ కేంద్రం ప్రారంభించారు. వాస్తవానికి వీరి స్వస్థలం బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామం. కానీ, ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడే స్థిరపడిపోయారు. ఆయన సతీమణి సుబ్బాయమ్మ కూడా యోగ విద్యలో పేరు గడించారు. విశేషమేమిటంటే యోగాతో చేకూరిన ఆరోగ్యంతో దంపతులిద్దరూ వెటరన్ క్రీడల్లో కూడా రాణించి ఎన్నో పతకాలు సాధించారు.

యోగా నియమాలు ఇలా

- సాధకులు విధిగా ప్రార్థనతో ప్రారంభించి..ముగించాలి.
- ఆందోళన, అలసట, ఆకలి ఉన్నపుడు యోగాకి దూరంగా ఉండాలి.
- ఆసనాల ముందు నీరు తాగితే మంచిది. తేలికైన వస్త్రాలు ధరించాలి.
- రుతుక్రమ సమయంలో మహిళలు యోగాకి దూరంగా ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.
- గర్భిణులు మొదటి నాలుగు నెలలు శిక్షకుల పర్యవేక్షణలో అసనాలు వేయొచ్చు.

అతిథులు.. వెళ్లిపోతున్నారు!

ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనం

- ఆలనాపాలనా చూసేవారు కరువు
- గుర్రపు డెక్కతో నిండిపోయిన చెరువు
- నీరు లేక విడిది మార్చుకుంటున్న వలస పక్షులు
- కన్జర్వేషన్ రిజర్వుగా గుర్తింపుతోనే సరి..
- వాచ్‌మన్‌కు పది నెలలుగా జీతం ఇవ్వని దుస్థితి



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క



గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పక్షులకు విడిదిగా ఆశ్రయం కల్పిస్తున్న ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ఆలన పాలన కరువైంది. ఈ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న గ్రామ పర్యావరణ అభివృద్ధి కమిటీ నిధుల కొరతతో సతమతమవుతోంది. కనీస నిర్వహణ కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. పక్షులకు నీరు లభ్యం కాక పోతుండంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నాయి. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంచినీటి చెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో పక్షులకు ఎలాంటి ఆహారం లభించడం లేదు. ఒకప్పుడు స్థానిక పర్యాటకులనే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని కూడా ఆకర్షించిన ఈ పక్షి కేంద్రం నేడు దయనీయమైన స్థితికి చేరుకుంది. అవసరం లేని పనులకు దుబారాగా నిధులు ఖర్చు చేసే ప్రభుత్వ శాఖలు జీవ వైవిధ్యానికి మారుపేరు అయిన ఈ పక్షుల కేంద్రానికి రూపాయి కూడా వెచ్చించకపోవడం దారుణం.

పలు దేశాల పక్షుల విడిది..

ఉప్పలపాడులోని మంచినీటి చెరువుకు పాతికేళ్ల క్రితం నుంచే వివిధ దేశాల నుంచి పక్షులు వలస వచ్చేవి. ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉండటంతో సైబీరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల నుంచి కూడా వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి పక్షులు విడిదికి వచ్చేవి. మొదట్లో అటవీ శాఖ ఆధీనంలో ఈ కేంద్రం ఉండేది. ఆ తర్వాత గ్రామ పర్యావరణ అభివృద్ధి కమిటీ ఆధీనంలోకి తీసుకొంది. ఇక్కడ చెరువులో ఉన్న చెట్లపై గుడ్లు పెట్టేందుకు.. వాటిని పొదిగేందుకు పక్షులకు అనువైన వాతావరణం ఉంది. చైనా, నేపాల్, హిమాలయాల నుంచి పెలికాన్స్, నైజీరియా నుంచి పెయింటెండ్ స్టార్క్స్, శ్రీలంక, ఆఫ్రికా నుంచి ఓపెన్ బిల్ స్టార్క్స్, దక్షిణాఫ్రికా నుంచి వైట్ ఐబిస్ వంటి పక్షలు వస్తుంటాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. చెరువుకు సమీపంలో మాగాణి ఉండటంతో వాటికి వ్యాపించే చీడపీడలను ఇవి ఆహారంగా తీసుకొంటాయి. ఎక్కువగా శీతాకాలంలో పక్షులు ఇక్కడకి వస్తుంటాయి. కొన్ని నెలల పాటు ఇక్కడే ఉండి గుడ్లు పెట్టి పొదిగి పిల్లలకు ఎగరడం వచ్చే వరకు ఆలనపాలన చూస్తుంటాయి.

తగ్గిన పర్యాటకుల సంఖ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక శాఖ ఈ కేంద్రాన్ని తనకు స్వాధీనం చేయాలని కూడా కోరింది. అయితే అందుకు అటవీ శాఖ ససేమిరా అంది. రకరకాల రంగురంగుల పక్షులను చూసేందుకు నిత్యం వందల సంఖ్యలో పర్యాటకులు పక్షుల కేంద్రానికి వస్తుంటారు. సాయంత్రం వరకు ఆస్వాదించి వెళ్తుంటారు. ఇప్పుడు ఆ పరిస్థితి భూతద్దం పెట్టి వెతికినా కనిపించడం లేదు. కేవలం ఆదివారం మాత్రమే అడపాదడపాగా పర్యాటకులు వస్తున్నారు. పర్యాటకులు ఆస్వాదించేందుకు తగిన సదుపాయాలు లేకపోవడం, చెరువు అంతా గుర్రపు డెక్క పెరిగి పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో ఒకసారి ఇక్కడికి వచ్చిన వాళ్లు మళ్లీ రావాలని కోరుకోవడం లేదు. దీంతో ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనంగా మారిపోతోంది. వాచ్‌మెన్‌కు పది నెలలుగా జీతం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఒక అవగాహనకు రావొచ్చు. కాగా జిల్లా యంత్రాంగం దీనిని కన్జర్వ్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు చర్యలు చేపట్టింది. అంతమాత్రాన ఈ కేంద్రానికి ఎలాంటి ఉపయోగం ఉండదు. దీనికి ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్వహణ సక్రమంగా చేస్తేనే పూర్వవైభవం వస్తుంది. లేకుంటే రాబోయే రోజుల్లో ఇదొక పాడుబడిన చెరువులా మారిపోయే ప్రమాదం పొంచి ఉంది.


ఎంపీలు, ఎమ్మెల్యేలు నిధులు కేటాయించాలి

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ప్రధానంగా గుంటూరు, విజయవాడ, మంగళగిరి-తాడేపల్లి నగరాల నుంచి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకు ఏటా వచ్చే నిధుల్లో కొంత పక్షుల కేంద్రానికి కేటాయించి అభివృద్ధి పనులు చేపడితే.. పూర్వవైభవం తీసుకురావొచ్చు. ప్రస్తుతం వేసవికాలం కానున్న దృష్ట్యా సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ అయినా కేటాయించి గుర్రపు డెక్కని పూర్తిగా తొలగిస్తే వర్షాకాలంలో చెరువుని పూర్తిస్థాయిలో మంచినీటితో నింపొచ్చు. దాంతో పక్షులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

డాక్టర్ కందిమళ్లకు తానా ఆహ్వానం



చిలకలూరిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): వచ్చే జూలై 3 నుంచి 5వ తేదీ వరకు అమెరికాలోని మిచిగాన్ నోవిలో జరిగే తానా మహాసభలలో పాల్గొనాలని పట్టణానికి చెందిన ప్రముఖ నాటక రచయిత, రంగస్థల కళాకారుడు, విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావుకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జరిగే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రత్యేక అతిథిగా పాల్గొనాలని ఆహ్వానంలో ఆయనను కోరారు. ఈ మేరకు మహాసభల చైర్మన్ నాదెళ్ల గంగాధర్, కో ఆర్డినేటర్ చాపలమడుగు ఉదయ్ కుమార్ ఆహ్వానం పంపారు.

నేడు మున్సిపల్ సమావేశం

వినుకొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మున్సిపల్ చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొంటారన్నారు. సమావేశానికి వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

చిలకలూరిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అయిన జడ్జి కె.నరేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, భరణం, ముందస్తు రాజీ కేసులు పరిష్కరించుకోవచ్చునని వివరించారు. కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణంలోని రెండు కోర్టులలో పెండింగులో ఉన్న రాజీ పడదగిన కేసులను ఈ లోక్ అదాలత్ లోపరిష్కరించుకోవాలని సూచించారు.

86 దుకాణాల్లో రేపటి నుంచి రేషన్ పంపిణీ

చిలకలూరిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల సరఫరాను తెల్లకార్డుల వారికి పంపిణీ చేయడం జరుగుతుందని చిలకలూరిపేట తహసీల్దార్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. చిలకలూరిపేట పట్టణం, మండలం పరిధిలో మొత్తం 86 రేషన్ దుకాణాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్ణీత వేళల్లో దుకాణాల్లో సరుకుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. ఆదివారం చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని దుకాణం వద్ద, పట్టణంలోని షాప్ నెంబర్ 19 వద్ద స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తారని వివరించారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

చిలకలూరిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): జూన్ 11వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం (తిరువణ్ణామలై) గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపో వారు సూపర్ లగ్జరీ పుష్ బ్యాక్ 36సీట్ల బస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ బస్సు 9వ తేదీ రాత్రి 10గంటలకు చిలకలూరిపేటలో బయలుదేరి 10వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, అలివేలు మంగాపురం, గోల్డెన్ టెంపుల్ దర్శనం చేయించుకుని 11వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షణ, అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకున్న అనంతరం 12వ తేదీ ఉదయం తిరిగి చిలకలూరిపేటకు బస్సు చేరుకుంటుందని చెప్పారు. మొత్తం టూర్ ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి రూ.2,500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్ లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కనమర్లపూడి (శావల్యాపురం) మే 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ఆటో ముందు చక్రం ఊడిపోవడంతో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై కనమర్లపూడి రైల్వేగేటు వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండకు చెందిన ఆంజనేయులు నాయక్ కుటుంబ సభ్యులతో కలసి బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో శుభకార్యానికి హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరాడు. మార్గమధ్యంలో కనమర్లపూడి రైల్వేగేటు వద్దకు రాగానే ఆటో ముందు చక్రం ఊడిపోవడంతో ఆటో పడిపోయింది. దాంతో ఆటోలో ఉన్న నాగమల్లేశ్వరికి తీవ్రగాయాలు కాగా ఆంజనేయులునాయక్, నాగమణి, మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో శావల్యాపురం, ఈపూరులకు చెందిన 108 సిబ్బంది అక్కడి వచ్చి క్షతగాత్రులను వినుకొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెండు గేదెలు మృతి

రొంపిచర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యపాలెం హైవే వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు ఈ నెల 29న మృతి చెందినట్టు కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన పొనుగోటి రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిషత్ సర్వ సభ్యసమావేశం జూన 6న జరుగుతుందని ఎంపీడీవో హేమలతాదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పరిషత్ అధ్యక్షుడు పి.ఝాన్సీ దయాసాగర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బొందిలిపాలెంలో అమలు కాని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

● వృథాగా చెత్త సేకరణ కేంద్రం
● రోడ్డు పక్కన వేస్తుండటంతో దుర్వాసన



గ్రామానికి వెలుపల రోడ్డుపక్కన వేస్తున్న చెత్త

బొందిలిపాలెం (శావల్యాపురం) మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. కానీ మండలంలోని బొందిలిపాలెంలో మాత్రం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ఊసే కనిపించడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడున్నర లక్షలు ఖర్చుచేసి మతుకుమల్లి వెళ్ళే మార్గంలో చెత్త సేకరణ కేంద్రాన్ని నిర్మించారు. చెత్తసేకరణ కేంద్రాన్ని నిర్మించి 8 ఏళ్ల గడుస్తున్నా ఇంతవరకు ఒక్కరోజు కూడా ఇంటింటికీ సేకరించిన చెత్తను అక్కడికి చేర్చిన దాఖలాలే లేవు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో చెత్తసేకరణ కేంద్రానికి రంగులు మార్చి కేంద్రాన్ని వాడుకలోకి తెచ్చి వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీకి కూడా సన్నాహాలు చేశారే తప్ప అది కార్యరూపం దాల్చలేదు. క్లాప్‌మిత్ర ఇంటింటికీ సేకరించిన చెత్తను కేంద్రానికి చేరవేయకుండా బయట ఆవరణలో పడేయడం, గ్రామస్థులు కొందరు ఇంట్లోని చెత్తను, వ్యర్థాలను క్లాప్‌మిత్రకు ఇవ్వకుండా గ్రామానికి వెలుపల రోడ్డు పక్కన పడేస్తుండంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రతి నెల మూడో శనివారం గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తున్నారు. కానీ కారుమంచి వెళ్ళే మార్గంలో బొందిలిపాలెం వెలుపల రోడ్డు పక్కనే వేస్తున్న చెత్తను వారు చూడకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి చెత్త సేకరణ కేంద్రాన్ని వాడుకలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రవిశంకర్ ఆశ్రమ పాఠశాలకు రూ.10.20లక్షల విరాళం

● ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేత



ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు విరాళం చెక్కును అందజేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, దాత మద్ది లలిత

యడ్లపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలల విద్యాభ్యున్నతికి ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట భారీ విరాళాన్ని అందజేసింది. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామ పరిధిలోని ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ ఆశ్రమ పాఠశాల (ఆర్ట్ ఆఫ్ లివింగ్)కు చిలకలూరిపేటకు చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు రూ.10.20లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలలో పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత విద్య సౌకర్యాలను అందించేందుకు క్లబ్ తొలి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా మద్ది లక్ష్మయ్య గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు, లలితమ్మ దంపతులు అందించిన రూ.10.20లక్షల ఆర్థిక సహకారాన్ని అశ్రమ పాఠశాలకు అందించినట్లు తెలిపారు. తాము అందించిన ఈ విరాళంతో పాఠశాలలోని మూడు బ్లాక్‌లలో మరుగుదొడ్ల నిర్మాణం, సాగునీటి సౌకర్యం, విద్యార్థులకు పుస్తకాలు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చనున్నట్లు వెల్లడించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రేమలత మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ ఆధ్వర్యంలో కొండవీడు కొండల నడుమ పచ్చని ప్రకృతి మధ్య అనాథలకోసం ఆశ్రమ పాఠశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలకు విలువలతో కూడిన ఉచిత విద్యను అందిస్తుండడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. చిలకలూరిపేట శాఖ ఇంతటి భారీ విరాళాన్ని సేకరించి అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో మౌలికవసతుల కల్పనకు భారీ విరాళాన్ని అందించిన ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులకు హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చైర్మన్ సభ్యులు కోలా విజయలక్ష్మి, క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, మాజీ ప్రెసిడెంట్ టి.రమాదేవి, సభ్యులు జాస్తి ప్రమీల, కె.భారతి, ఎం.పద్మావతి, జి.రత్న, డాక్టర్ గట్టు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ముగిసిన ఎమ్మెస్ ఆఫీస్‌పై శిక్షణ

నరసరావుపేట రూరల్, మే 30: (ఆంధ్రజ్యోతి) జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) నరసరావుపేట క్యాంపస్‌లో మే 19 నుంచి మే 30 వరకు నిర్వహించిన ఎమ్మెస్ ఆఫీస్ హ్యాండ్స్-ఆన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నరసరావుపేటలోని బోధన, బోధనేతర సిబ్బంది కోసం ప్రత్యేకంగా నిర్వహించామన్నారు. మొత్తం 40మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.పి.రాజు, ఎన్‌వీ రామారావు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధ్రువపత్రాలు అందచేశారు.



బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



జిల్లా భూసార పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

భూసార ఫలితాలను రైతులకు ఇవ్వాలి

● జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నరసరావుపేట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పొలాల నుంచి సేకరించిన మట్టి నమూనాలకు భూసార పరీక్షలు వేగంగా నిర్వహించి ఫలితాలను రైతులకు అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళి తెలిపారు. నరసరావుపేటలోని భూసార పరీక్షా కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న పోషకాల విశ్లేషణ, పీహెచ్, ఈసీ సూక్ష్మ పోషకాల స్థాయి తదితర పరీక్షలను పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డులోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు పరీక్షలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, భూసార పరీక్ష కేంద్ర అధికారి జి.వరలక్ష్మి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచండి

● జిల్లా ఆరోగ్య సమన్వయ అధికారి జ్ఞాన ప్రసూనాంబ

ఈపూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాన్పుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని, రోగులతో ఆప్యాయంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య సమన్వయ అధికారి జ్ఞాన ప్రసునాంబ అన్నారు. ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె విజిట్ చేశారు. వార్డులు, ల్యాబ్, ఓపీ, స్కానింగ్ గదులను ఆమె పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ల్యాబ్‌లో ఎలాంటి పరీక్షలు చేస్తున్నారని టెక్నీషియన్లను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి వైద్య సేవలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలు, ఏపీ డీఎం ఈహెచ్‌ఆర్ సేవలను మరింత మెరుగ్గా అందించాలన్నారు. త్వరలో ఆసుపత్రిలో ఉన్న వైద్యుల ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్, ఫోన్ నెంబర్లను వెంట తీసుకురావాలన్నారు. ఆమె వెంట సునీత, రేణుకాదేవి, హేమలత, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నేతలను విమర్శించే నైతిక హక్కు శ్రీకాంత్‌కు లేదు

● టీడీపీ బ్రాహ్మణ సాధికార అధికార ప్రతినిధి గూడూరు శేఖర్

నరసరావుపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ జాతికి తీవ్రమైన ద్రోహం చేసిన జ్వాలాపురం శ్రీకాంత్ లాంటి వైసీపీ బ్రాహ్మణ నేతలకు టీడీపీ బ్రాహ్మణ నేతలను విమర్శించే నైతిక హక్కులేదని బ్రాహ్మణ సాధికార అధికార ప్రతినిధి గూడూరు శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ దేవదాయశాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ అనంతపురం వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాహ్మణుల సంక్షేమం కోసం 2014-19 మధ్య, కూటమి ప్రభుత్వ ఏర్పాటులోను బ్రాహ్మణ సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంస్థ, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఈ రెండు సంస్థల ద్వారా అమలుచేసిన పలు పథకాలను రద్దుచేసి ఈ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి బ్రాహ్మణ జాతికి వైసీపీ ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసిందన్నారు. శ్రీకాంత్ దేవదాయ ధర్మదాయ పదవిలో ఉన్నప్పుడు రాష్ట్రంలో దేవాలయాలలో రథం తగలపడిన సంఘటన, విగ్రహం తల తీసిన ఘటన, రథం విగ్రహాల చోరీ, పలు దేవాలయాల ధ్వంసం, పలువురు అర్చకులపై దాడులు తదితర వికృత చేష్టలకు మీరు ప్రత్యక్ష సాక్షులు కాదా అని ప్రశ్నించారు. ఎన్నిక హామీ మేరకు కూమిట ప్రభుత్వం ధూప, దీప నైవేద్యం స్కీమ్ కింద అర్చకులకు రూ.5 వేల నుంచి రూ.10వేలు, రూ.10 వేలు ఆదాయం ఉన్నవారికి రూ.15 వేలకు పెంచిందన్నారు. నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగభృతి కింద నెలకు రూ 3 వేలు ప్రకటించి వారి ఖాతాలలో జమచేస్తుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది టీడీపీ ప్రభుత్వం అయితే, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను కోల్డ్ స్టోరేజ్‌లోకి పెట్టింది వైసీపీ అన్నారు.

వైభవంగా నాభిశిల వార్షికోత్సవం

కనమర్లపూడి (శావల్యాపురం) మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమర్లపూడిలోని నాభిశిల 13వ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు బిందెలతో నీళ్ళు తెచ్చి నాభిశిలకు అభిషేకాలు నిర్వహించారు. నాభిశిల వద్ద భక్తులు హోమాలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు నాభిశిలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాభిశిల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు మాజీ సర్పంచ్ అంజలీప్రసాద్ అన్నదానం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు మర్రి నరేంద్ర, డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ, నీటిసంఘం అధ్యక్షుడు బోడెపూడి శంకర్, సీనియర్ నాయకులు గడిపూడి విశ్వనాథం, గోరింట్ల హనుమంతరావు, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, ఒత్తుల వెంకటేశ్వర్లు, బోడెపూడి వెంకటేశ్వర్లు, దివ్యకోలు వెంకయ్య, పూరేటి నరసింహారావులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

నూజెండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నూజెండ్లలో కేజీబీవీ పాఠశాల ఆవరణలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన, కమ్మవారిపాలెంలోని ఎస్సీ కాలనీలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. ఏడాది లోపే ఇచ్చిన హామీలను అన్ని అమలు చేసిన రాజకీయ పార్టీ ఎక్కడైనా ఉంటే చూపించాలని సవాల్ చేశారు.

అంబులెన్స్‌లో అర్ధరాత్రి ప్రసవం

నాదెండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అంబులెన్స్‌లో ఒక యువతి బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని ఎండుగుంపాలెం పరిధిలోని కాలువ గట్టు మీద నివశించే ఎండేటి భద్రయ్య భార్య అడివమ్మకు అర్ధరాత్రి నొప్పులు రావటంతో యడ్లపాడు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఎండుగుంపాలెం నుంచి ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మగ బిడ్డను ప్రసవించింది. ఆమెకు ఈఎంటీ యడ్ల శోభన్‌బాబు, పైలెట్ షేక్ అల్లాభక్షు, ఆషా వర్కర్ బిందు సహకరించారు. అనంతరం వీరిని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మేనేజర్ సుబ్బారావు సిబ్బందిని అభినందించారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు మృతి

శావల్యాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని యువకుని మృతదేహం గుంటూరు-గుంతకల్ రైల్వే మార్గంలోని శావల్యాపురం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం లభ్యమైంది. రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని ఆనవాళ్ళ నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నర్సరావుపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి 25సంవత్సరాలు వయసుంటుందని, తెలుపు షర్ట్, బ్లూ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చొక్కాపై జనసేన సింబల్ లోగో ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. నరసరావుపేట రైల్వే ఏఎస్ఐ సుభానీకి 6301305671 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి తిరునాళ్ల



ఐనవోలు ప్రసన్నాంజనేయ స్వామి, తిరునాళ్ళ సందర్భంగా నిర్మించిన విద్యుత్ ప్రభ

నూజెండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోలులోని ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తిరునాళ్ళను పురస్కరించుకొని పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. తిరునాళ్ళను పురస్కరించుకొని రెండు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా వర్షం కారణంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిలిచిపోయాయి.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం

వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్





వినుకొండటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న వివిధ సమస్యలపై వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ పలు విషయాలు ఆంధ్రజ్యోతి మాట్లాడారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై తీసుకుంటున్న చర్యలు ఏంటి?

కమిషనర్: ఇటీవల ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సూచనల మేరకు శివయ్యస్థూపం సెంటర్‌లో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. ఫారెస్ట్ కార్యాలయం నుంచి శివయ్యస్థూపం వరకు డివైడర్‌ను ఏర్పాటు చేస్తామని దీనివల్ల ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

నూజెండ్ల రోడ్డులోని ఆర్‌యూబీ గుంతలను ఎప్పుడు పూడ్చుతారు?

● ఊటగా వస్తున్న నీటిని తరలించేందుకు కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేశాం. కాంట్రాక్టర్‌కు అవసరమైన మెటీరియల్ తరలించేందుకు ఆలస్యమైంది. త్వరలో ప్రయాణికులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపడతాం.

వినుకొండ రైల్వేస్టేషన్ రోడ్డు పునఃరుద్ధరణ పనులు చేపడతారా?

● వినుకొండ రైల్వేస్టేషన్ రోడ్డు అధ్వానంగా ఉంది. 15వ ఫైనాన్స్ నిధుల నుంచి 40అడుగుల రోడ్డు ఏర్పాటు చేసి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తాం.

వర్షాకాలంలో డ్రెయినేజీ సమస్యలపై ఏం చర్యలు చేపడుతున్నారు?

● ప్రధాన రహదారులు ఉన్న మూడు డ్రెయినేజీలను ఇప్పటికే 15వ ఫైనాన్స్ నిధులతో పూడిక తొలగించే కార్యక్రమం చేపట్టాం. త్వరలో డివైడర్లను ఏర్పాటుచేసి, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తాం.

బహిరంగ ప్రదేశాల్లో జీవాలను వధించడంపై చర్యలేం తీసుకుంటున్నారు?

● ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రోడ్డుపై మూగజీవాలను వధించడాన్ని అడ్డుకుంటాం. పది రోజుల్లో తిమ్మాయపాలెం రోడ్డులోని జంతు వధశాలకు వీటిని తరలిస్తాం.

మున్సిపాలిటీలో వేటిని విలీనం చేస్తున్నారు?

● వెల్లటూరు రోడ్డులోని హస్తినాపురం, ద్వారకానగర్‌ను ఇప్పటికే మున్సిపాలిటీలో విలీనానికి సర్వం సిద్ధమైంది. పన్నులు వసూలు చేసి స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తాం.

రెయిలింగ్ లేకుండా ప్రమాదకరంగా వంతెన



రెయిలింగ్ లేని అన్నవరం వాగు వంతెన

రొంపిచర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్ళే రహదారిలో అన్నవరం వద్ద వంతెన ఉంది. ఈ బ్రిడ్జికి ఇరువైపులా రెయిలింగ్‌లు లేవు. రాత్రి సమయాల్లో పలువురు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కావటంతో ఈ బ్రిడ్జిపై మరింత ఇబ్బందికరంగా మారుతుందని వాహనచోదకులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రెయిలింగ్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.



దాసరి నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు

దర్శకరత్న దాసరికి ఘన నివాళి

వినుకొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): దర్శకరత్న దాసరి నారాయణరావు వర్థంతి సందర్భంగా గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్టూడియోలో దాసరి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గుమ్మడి కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, భీమవరపు ఏడుకొండలు, మందేపల్లి లక్ష్మీనరసయ్య, వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, ముదికోటి మహేశ్వరరావు, వీరయ్య, బొంకూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి

● మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో కొత్తగా పదవులు పొందిన వారు పార్టీ పటిష్టతకు నిరంతర కృషిచేయాలని మాజీ మంత్రి విడదల రజిని శుక్రవారం కోరారు. పల్నాడు జిల్లా వైసీపీ కమిటీలో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి వివిధ పదవులు పొందిన వారు మర్యాదపూర్వకంగా ఆమెను ఇక్కడ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కమిటీలో ఉపాధ్యక్షుడిగా మద్దూరి వెంకట శివరామ కోటిరెడ్డి, కార్యదర్శులుగా వలేటి వెంకటేశ్వరరావు, యర్రబోతు సాంబశివరావు, పఠాన్ తలహాఖాన్, నలమాల జీవరత్నం, అధికార ప్రతినిధిగా ఉడతా వెంకటేశ్వర్లు పదవులు పొందారు.